క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఎస్‌వీసీటీ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8 తరగతులు చదువుతున్న పేద విద్యార్థులు 30 మందికి స్వామిబాబు, వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు (ఎస్‌వీసీటీ) ఆధ్వర్యంలో దసరా పురస్కరించుకుని రెండు జతల దుస్తులు శనివారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధిలు డి.రమేష్, రామారావు, కాంతారావు, కరుణశ్రీ దుస్తులను అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో తల్లి, తండ్రి, తల్లిదండ్రులు ఇద్దరూ లేని విద్యార్థులు 30 మందిని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. వీరికి టెన్త్ క్లాస్ వరకు అన్ని అవసరాలు ట్రస్టు తీర్చుతుందన్నారు. ట్రస్టు సిబ్బంది దివ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న శ్రీనివాసానంద స్వామి

సరుబుజ్జిలి: హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని అఖిల భారత విశ్వహిందూ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి అన్నారు. పురుషోత్తపురం సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భక్తి గేయాలు ఆలపించారు. ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, విశ్వ హిందూ పరిషత్ ఆమదాలవలస శాఖ అధ్యక్షుడు బగాది భాస్కరరావు, వికాస తరంగిణి సభ్యుడు సంజీవరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు నరసన్నపేట కోలాట బృందం



తిరుమలకు పయనమైన కోలాట బృందం సభ్యులు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్‌కు చెందిన హారికా కోలాట బృందం సభ్యులు తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనను ఇవ్వనున్నారు. ఈ మేరకు తిరుమల నుంచి ఆహ్వానం రాగా.. కోలాట బృందం సభ్యులు శనివారం తిరుమలకు పయనమయ్యారు. ఈ నెల 8న మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపులో కోలాట నృత్య ప్రదర్శన ఇస్తున్నట్లు హారిక సునీత తెలిపారు. నృత్యం చేసేందుకు అవకాశం రావడం ఆనందంగా ఉందని, ఇప్పటివరకు 9 సార్లు తిరుమలకు వెళ్లి ప్రదర్శన ఇచ్చామని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా



రాయల-దిమిలి గ్రామాల కూడలి వద్ద టిప్పర్‌కు ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని రాయిల-దిమిలి గ్రామాల కూడలి వద్ద ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. మండలంలోని పానుటూరు గ్రామ సమీపంలోని వంశధార నది నుంచి నాటు బండ్లపై ఇసుకను రాయల, దిమలి గ్రామాల కూడలి వద్దకు తీసుకువచ్చి నిల్వ చేస్తున్నారు. ఈ ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని వారాలుగా ఒడిశాకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

క్రికెట్ విజేత అక్కులపేట



అక్కులపేట జట్టు సభ్యులు

ఆమదాలవలస: సత్యసాయి నేషనల్ క్రికెట్ లీగ్-యూనిటీ కప్ సమితి స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆ సమితి జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ బనిసెట్టి సాయికృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ గ్రామాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. అక్కులపేట (వేణుమ్మపేట) జట్టు విజేతగా నిలిచింది. వీరికి ఆమదాలవలస జోన్ తరఫున సంస్థ పెద్దలు, సమితి జిల్లా గ్రామసేవ ఇన్‌చార్జి రవీంద్రబాబు, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు, ఐటీ కో ఆర్డినేటర్ సాయిప్రసాద్, జోనల్ కన్వీనర్లు జనార్దనరావు, కామావధానులు, సూర్యారావు ట్రోఫీ అందజేశారు.

మూలకుచేరిన.. ఫాగింగ్ యంత్రాలు



వాండ్రాయి సచివాలయంలో ఒక్కసారి కూడా వినియోగించని ఫాగింగ్ యంత్రం



గొర్రిబంద సచివాలయంలో మూలకుచేరిన ఫాగింగ్ యంత్రం

- గ్రామాల్లో పెరుగుతున్న దోమలు
- విజృంభిస్తున్న జ్వరాలు
- పట్టించుకోని అధికారులు

సారవకోట: ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా, డెంగీ జ్వరాలు ప్రధానంగా గ్రామాల్లో కన్పిస్తున్నాయి. ఈ జ్వరాలన్నీ వర్షాలు కురుస్తుండటంతో దోమలు అధికంగా వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో ఏ ఒక్కర్ని చూసినా చేతికి ఐవీలు పెట్టుకుని కన్పిస్తున్నారు. దీనికి కారణమైన దోమల నివారణకు గత ప్రభుత్వ హయాంలో ఒక్కొక్క సచివాలయానికి ఒక్కొక్క ఫాగింగ్ యంత్రం చొప్పున నరసన్నపేట నియోజకవర్గంలో ఉన్న 89 సచివాలయాలకు మంజూరు చేశారు. ఈ యంత్రాలు ప్రస్తుతం ఆయా సచివాలయాలలో వినియోగంలో లేక మూలకుచేరాయి. ఈ యంత్రాల ద్వారా ఆయా సచివాయలలో ఉన్న అన్ని గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుంది.

అవగాహన లేమి..

ఫాగింగ్ యంత్రాల వినియోగంపై సచివాలయ సిబ్బందికి అవగాహన లేక పోవడం వినియోగించే దాఖలాలు లేకుండా పోయాయి. గత ప్రభుత్వం అందించిన ఈ యంత్రాలను కొన్ని సచివాలయాలలో ఒక్కసారి కూడా వినియోగించే దాఖలాలు కన్పించక పోగా.. ఒకట్రెండు సచివాలయాలలో అప్పుడప్పుడు వినియోగించారు. ఈ యంత్రాలలో ఫాగింగ్ జ్యూస్(గ్లిజరిన్‌తో కూడిన ద్రావణం)ను డిజిల్, పెట్రోల్‌లో కలిపి వేస్తారు. ఫాగింగ్ జ్యూస్ డీజిల్‌తో కలిసి మండి పోగ రూపంలో బయటకు రావడంతో దోమలు మృతి చెందుతాయి. దోమల వ్యాప్తి తగ్గితే జ్వరాలు తీవ్రత తగ్గుతుంది.

మండలం	సచివాలయాలు	ఫాగింగ్ యంత్రాలు
సారవకోట	20	20
నరసన్నపేట	22	22
పోలాకి	23	23
జలుమూరు	24	24

అపరిశుభ్రత..

మురుగు నీరు ఎక్కడిక్కడే నిల్వ ఉండటంతో దోమలు తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. గ్రామాలలో దోమలు పెరగడంతో ప్రస్తుతం జ్వరాల తీవ్రత అధికంగా విస్తరిస్తున్నాయి. ఇప్పటికైనా వేలాది రూపాయలు వెచ్చించి అప్పటి ప్రభుత్వం అందించిన ఫాంగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల తీవ్రత అధికంగా ఉంది



గ్రామాలలో దోమల తీవ్రత అధికంగా ఉంది. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఫాగింగ్ యంత్రాల వినియోగించి ఫాగింగ్ చేసినట్లు ఎక్కడా చూడలేదు. ఆ యంత్రాలు వినియోగంలోకి తెస్తే దోమల నివారణతో జ్వరాల వ్యాప్తి తగ్గుతుంది.

– సారవకోట అప్పారావు, సామాజిక కార్యకర్త, సారవకోట

జంగిల్ క్లియరెన్స్ చేయాలి



పొందూరు: తాడివలస-బొడ్డేపల్లి రహదారిలో పెరిగిన పిచ్చిమొక్కలు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం రహదారిలో ఇరువైపులా ఉన్న పొదలు

సరుబుజ్జిలి: ఏబీ రోడ్డుతోపాటు, పురుషోత్తపురం, ఆమదాలవలస, సవలాపురం జంక్షన్, యరగాం వరకు ఉన్న తుప్పలు తొలగించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఈ రహదారుల్లో పురుషోత్తపురం, పాలవలస, రావివలస, అలమాజీపేట, మూలసవలాపురం, పెద్దసవళాపురం, ఇస్కలపాలెం, పెదమాలపేట గ్రామాల వాసులు మండల కేంద్రానికి తరచూ రాకపోకలు చేస్తుంటారు. గుబురుగా తుప్పలు పెరగడంతోపాటు, రహదారి మొత్తం వలయాలు అధికంగా ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

తాడివలస-బొడ్డేపల్లి రహదారిలో..

పొందూరు: మండలంలోని తాడివలస-బొడ్డేపల్లి రహదారిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాహనదారులు ఈ రహదారిలో శ్రీకాకుళం పట్టణానికి రాకపోకలు చేస్తుంటారు. బొడ్డేపల్లి గ్రామం సమీపంలో పిచ్చి మొక్కలు అధికంగా పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మలుపుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జంగిల్‌ను క్లియరెన్స్ చేయాలని కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నరసన్నపేట: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువతలో క్రీడాలపై ఆసక్తి పెంచేందుకు సత్యసాయి సంస్థలు కూడా ముందుకు రావడం మంచి పరిణామమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక సత్యసాయి జోనల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జోనల్ స్థాయిలో క్రికెట్ పోటీలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ పోటీలు క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేలా ఉండాలన్నారు. నాలుగు జట్లు పాల్గొనగా.. జిల్లా స్థాయికి ఒక జట్టును ఎంపిక చేస్తామని జోనల్ కమిటీ కన్వీనర్ మూర్తి తెలిపారు. జిల్లా పోటీలు 27న నిర్వహిస్తున్నామని, ఈ పోటీలు కూడా సత్యసాయి సంస్థలఆధ్వర్యంలోనే ఉంటాయన్నారు. మారుతీనగర్ మందిరం ప్రతినిధులు ఎం.ఎల్.నాయుడు, నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

అన్నపూర్ణదేవిగా నీలమణిదుర్గమ్మ



పాతపట్నం: అన్నపూర్ణదేవి అలంకరణలో నీలమణిదుర్గమ్మ



హిరమండలం: అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన నీలమణిదుర్గ అమ్మవారు

పాతపట్నం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు శనివారం అన్నపూర్ణదేవిగా పూజలు అందుకున్నారు. దేవాతా హోములు, అమ్మవారి మూలమంత్ర హోమాలను అమ్మవారి ఆవరణలోని యోగశాలలో నిర్వహించారు. పర్లాకిమిడి, పాతపట్నంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు..

పాతపట్నం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దసరా నవరాత్రులు నిర్వహిస్తున్నారు. అంతరాబ జంక్షన్ సమీపంలో శ్రీనీలమణిదుర్గ టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద డ్రైవర్లు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు.

గాయత్రిదేవిగా వారాహి అమ్మవారు..

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలిసిన వారాహి అమ్మవారు శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భీమేశ్వర ఆలయంలో ఉన్న మూడు ముఖాలు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు.

పెద్దకోరాడలో..

హిరమండలం: పెద్దకోరాడలోని నీలమణిదుర్గ అమ్మవారు దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దివాకర్ పండా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జలుమూరు: పూజలు అందుకుంటున్న మూడు ముఖాల అమ్మవారు

8 మద్యం షాపుల మంజూరు



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీఐ కృష్ణారావు

పాతపట్నం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 మద్యం షాపులు మంజూరు చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు అన్నారు. శనివారం ఎక్సైజ్ స్టేషన్‌లో పాతపట్నం మండలానికి సంబంధించి రెండు ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చాయన్నారు. పాతపట్నం మండలంలో నాలుగు, సారవకోట మండలంలో నాలుగు దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వీటిని ప్రైవేట్‌గా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలన్నారు. దరఖాస్తు ఫీజు తిరిగి ఇవ్వబడదన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 11న లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తారన్నారు. పూర్తి వివరాలకు పాతపట్నం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 మద్యం దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో 4 మద్యం దుకాణాలు, ఆమదాలవలస మండలంలో మూడు, సరుబుజ్జలి మండలంలో రెండు, ఎల్.ఎన్.పేట మండలంలో రెండు, బూర్జ మండలంలో రెండు దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు రూ.రెండు లక్షలు చెల్లించాలన్నారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 11న శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానం ద్వారా మద్యం దుకాణాలక ఎంపిక జరుగుతుందన్నారు.

74 మంది గైర్హాజరు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో శనివారం రెండు సెషన్లలో నిర్వహించిన టెట్ పరీక్షకు 74 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. ఉదయం సెషన్‌లో 330 మందికి 38 మంది, సాయంత్రం సెషన్‌లో 330 మందికి 36 మంది గైర్హాజరాయ్యరన్నారు. మూడో రోజు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు.

అపరాధ రుసుం విధింపు

కొత్తూరు: మెట్టూరు, కొత్తూరు గ్రామాల వద్ద సెప్టెంబర్ 29వ తేదీ రాత్రి ఇసుక అక్రమంగా తరిస్తున్న ఏడు లారీలను పోలీసులు పట్టుకున్నారు. నిబంధనలు పాటించకపోవడంతో ఒక్కో లారీకి రూ.25వేల అపరాధ రుసుంను మైన్స్ అధికారులు విధించినట్లు స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ శనివారం తెలిపారు. అపరాధ రుసుం కట్టిన అనంతరం ఇసుక లారీలను విడుదల చేసినట్లు చెప్పారు.

తమ్మినేనికి అభినందనలు



తమ్మినేనికి అభినందనలు తెలుపున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

ఆమదాలవస: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట మండల పార్టీ నాయకులు శనివారం ఆమదాలవలసలోని తమ్మినేని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్ గుప్తా, ధర్మాన జగన్, సురంగి నర్సింగరావు, సర్పంచ్‌లు కొండల బాబూరావు, సిరిసిల్ల తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

కొత్తూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గంగరావు సింహాచలం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్నా.. ఉచిత ఇసుకను భవన నిర్మాణదారులకు ఇవ్వడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయకపోవడంతో వంశధార నది నుంచి అక్రమంగా తవ్వకాలు చేసి అధిక రేట్లకు విక్రయించడంతో భవన నిర్మాణదారులపై అదనపు భారం పడుతుందన్నారు. ఇసుక ర్యాంపులను ఇంతవరకు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. భవన నిర్మాణ కార్మికల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఎన్నికలు ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చకపోవడం సరికాదన్నారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పాలపోలమ్మను దర్శించుకున్న తమ్మినేని

ఆమదాలవలస: పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారిని మాజీ స్పీకర్, జిల్లా వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం, వాణమ్మ దంపతులు శనివారం దర్శించుకున్నారు. దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మూడో రోజు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని తమ్మినేని దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు తమ్మినేని దంపతులకు ఆహ్వానం పలికారు. పార్టీ నాయకులు అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పొన్నాడ చిన్నారావు, పొడుగు శ్రీను, దుంపల శ్యామలరావు తదితరులు ఉన్నారు.



పాలపోలమ్మను దర్శించుకుంటున్న తమ్మినేని సీతారాం, వాణమ్మ దంపతులు

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక సెక్షన్ ఆర్ అండ్‌బీ ఏఈగా శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన రాజశేఖర్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేసి నరసన్నపేటకు బదిలీపై వచ్చారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఏఈగా నర్సింగరావు..



మండల ఏఈగా బగ్గు నర్సింగరావు బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళంలో పనిచేసిన ఈయన బదిలీపై నరసన్నపేటకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేసిన మోహనరావుకు బదిలీ అయింది.

హౌసింగ్ ఏఈగా రాజేంద్రప్రసాద్..



గృహనిర్మాణ శాఖ ఏఈగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఎచ్చెర్ల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శంకరరావు శ్రీకాకుళం రూరల్‌కు బదిలీపై వెళ్లారు.

సీఎస్‌డీటీగా ప్రసాదరావు..



పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీగా బి.ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదే కార్యాలయంలో డీటీగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సీఎస్‌డీటీ ఎస్.బీమారావు కొత్తూరు మండలం ఎఫ్‌సీ గొడౌన్ ఇన్‌చార్జిగా బదిలీపై వెళ్లారు. పలువురు వీర్వోలు కూడా శనివారం బదిలీపై వచ్చారు. బి.మురళీకృష్ణ సీది నుంచి బద్దుమర్రి, టి.వెంకటరావు తీమర నుంచి ఆర్.ఎల్.పురం, పి.వెంకటేశ్వరరావు ఆర్.ఎల్.పురం నుంచి బూరగాం, ఎం.అలేఖ్య బద్దుమర్రి నుంచి పెద్దలొగిడి, కె.సూర్యానారాయణ చంగుడి నుంచి సింగుపురం, కె.కృష్ణవేణి సింగుపురం నుంచి ఎ.ఎస్.కవిటి, పి.శ్రావణి ఎ.ఎస్.కవిటి నుంచి తిడ్డిమి, ఆర్.మాధవరావు తిడ్డిమి నుంచి పాతపట్నం-2, బి.అన్నాజీరావు మెళియాపుట్టి మండలం నుంచి పాతపట్నం-1, శ్యామ్యూల్ మెళియాపుట్టి మండలం నుంచి చంగుడి, కె.ఈశ్వరరావు హిరమండలం మండలం నుంచి తెంబూరుకు బదిలీపై వచ్చారు.

విధుల్లో చేరిక..



ఆర్.కాళీప్రసాద్

హిరమండలం: స్థానిక ఎంపీడీఓగా ఆర్.కాళీప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎల్.ఎన్.పేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన బి.శైలజ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. మండల ఉప తహసీల్దార్‌గా కె.బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇచ్ఛాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీటీ బి.వెంకటరమణ పాతపట్నంకు బదిలీపై వెళ్లారు. సర్వేయర్ నీలిమ డీటీగా బాధ్యతలు స్వీకరించారు. వెలుగు కార్యాలయలం ఏపీఎంగా పైడి కూర్మారావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి సీతంపేటకు బదిలీపై వెళ్లారు.



కె.బాలకృష్ణ

ఎక్సైజ్ సీఐగా..



కొత్తూరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సీఐగా కిరణ్ మణీశ్వరి శనివారం విధుల్లో చేరారు. సీఐ కిరణమణీశ్వరి చోడవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సీఐ జయరామరెడ్డి డిస్టలరీ వింగ్‌కు బదిలీపై వెళ్లారు.

7, 8 తేదీల్లో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

హిరమండలం: మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లకు, ఒక్కో గ్రామ పంచాయతీలో ఇద్దరు వార్డు మెంబర్లకు ఈ నెల 7, 8 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధిపై వీరికి శిక్షణ ఇస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల ద్వారా సమాచారం అందించామన్నారు. వీరు విధిగా శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

మురుగునీటిలో తాగునీటి కుళాయి



ఈ చిత్రం కొత్తూరు మండలం నివగాం మెయిన్ రోడ్డులో మురుగునీటి కాలువకు ఆనుకుని మంచినీటి కుళాయి ఏర్పాటుచేశారు. ఈ కాలువ నుంచి మురుగునీరు వెళ్లకపోవడంతో కుళాయి చుట్టూ మురుగునీరు చేరింది. గత్యంతరం లేక ప్రజలు మురుగునీటిలో ఉన్న తాగునీటి కుళాయి నుంచి నీరు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించింది. పరిస్థితులు మాత్రం క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉన్నాయి.

- కొత్తూరు